క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మొగుళ్లపల్లి: మండలంలోని మొగుళ్లపల్లి, రంగాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రమోద్ తెలిపారు. ఆయా పరిదిధిలోని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

మహదేవపూర్ మండలంలో..

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం, సూరారం సబ్‌స్టేషన్ల పరిధిలో మెయింటనెన్స్ మరమ్మతులు జరుగుతున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయ కలుగుతుందని ఏఈఈ శ్రీకాంత్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ



రేగొండ: ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై గ్రామాల్లో శనివారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఏపీఓ జమీర్‌పాషా తెలిపారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీపై పంచాయతీ కార్యదర్శులు, సామాజిక తనిఖీ టీం సభ్యులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై తనిఖీ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సతీష్, ఈసీ మధుకర్, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ రమేష్ టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

18న ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు

కాటారం: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల ఆవరణలో ఈ నెల 18న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ దేవానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లో బాల బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తమ స్టడీసర్టిఫికెట్‌తో ఈనెల 18న ఉదయం 9 గంటలకు క్రీడల మండల కన్వీనర్ పీడీ విజయలక్ష్మిని సంప్రదించాలని ఎంఈఓ కోరారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



కాటారం: ప్రమాదవశాత్తు మృతి చెందిన తండ్రికి కూతురు తలకొరివి పెట్టింది. వివరాల్లోకి వెళ్తే.. కాటారం మండలం ధన్వాడకు చెందిన పబ్బ రాంచందర్‌గౌడ్(54) శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయనకు భార్య విజయతో పాటు ఇద్దరు కూతుర్లు రజని, శ్రావణి ఉన్నారు. కొడుకు లేకపోవడంతో పెద్ద కూతురు రజని తండ్రికి సంబంధించిన అన్ని కార్యక్రమాలు పూర్తి చేసింది. అంత్యక్రియల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



భూపాలపల్లి అర్బన్: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి జిల్లా కేంద్రంలో పార్టీ నాయకులు ఘన నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు, నాయకులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన పోరాటాలకు హాజరైన ఘటనలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజయ్య, రమేష్, శేఖర్, మహేందర్, రజిత, లింగయ్య పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డేలేదా..?

- చలివాగు నుంచి ఇండస్ట్రీయల్‌కు రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు



కాటన్ ఇండస్ట్రీస్‌లో ఇసుకను డంప్ చేస్తున్న ట్రాక్టర్


టేకుమట్ల : మండలంలోని టేకుమట్ల, అంకుషాపూర్, సోమనపల్లి చలివాగు శివారు నుంచి చిట్యాల మండలంలోని శాంతినగర్ శివారు ఆంజనేయ కాటన్ ఇండస్ట్రీస్‌కు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రంగా రవాణా చేస్తున్నారు. నిబంధనల ప్రకారం రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకుని ఇసుకను తరలించుకోవాలనే నిబంధనలు ఉన్నప్పటికీ అనుమతి తీసుకోకుండానే రవాణా చేస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు.

నిల్వ చేసిన ఇసుక డంప్‌పై ఆరా..

శాంతినగర్‌లోని ఆంజనేయ కాటన్ ఇండస్ట్రీస్‌లో నిల్వ చేసిన సుమారు 300 ట్రిప్పుల ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం. గత రెండు రోజులుగా కాటన్ ఇండస్ట్రీస్‌లో ఇసుక రవాణా చేస్తుండగా శుక్రవారం పోలీస్, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. దీంతో ఇసుక రవాణా నిలిచిపోయింది. అనుమతులు తీసుకుని ఇసుకను తరలించుకోవాల్సిన కాటన్ ఇండస్ట్రీస్ నిర్వాహకులు నిబంధనలు పాటించకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఇంటి నిర్మాణం పేరుతో ఇతర మండలాలకు..

ఇంటి నిర్మాణ, ఇతర వ్యక్తిగత అవసరాలకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని అవసరం ఉన్నంత వరకే ఇసుకను తీసుకోవచ్చని స్థానిక ఎమ్మెల్యే అవకాశం కల్పించడంతో ఇదే అదనుగా భావించి కొంత మంది ఇతర మండలాలకు ఇసుకను తరలించి డంపు చేసి పట్టణాలకు రవాణా చేస్తున్నారు. టేకుమట్ల, అంకుషాపూర్, బూర్నపల్లి చలివాగు నుంచి పట్టపగలే నిత్యం ఇసుక రవాణా చేస్తుండగా అధికారులు చోద్యం చూడడంపై మండల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక అవసరాలకు ఇసుకను తీసుకెళ్లేందుకు అధికారులు అవకాశం కల్పించాలి కానీ డంప్‌లకు ఇసుకను తరలిస్తుండగా రెవెన్యూ అధికారుల నిర్లక్ష్య తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఇసుక ట్రాక్టర్‌కు ఇచ్చిన గేట్‌పాస్

ఇతర ప్రాంతాలకు తరలిస్తే కేసులే

ఇంటి నిర్మాణానికి మాత్రమే ఇసుకను తీసుకెళ్లేందుకు అవకాశం కల్పిస్తున్నాం. అంతే కాని ఇతర ప్రాంతాలకు, ఇండస్ట్రియల్‌లకు తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

– గోగికారి ప్రసాద్, ఎస్సై, టేకుమట్ల

క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

భూపాలపల్లిరూరల్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టంతో, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఫ్రెషర్స్ డే పార్టీ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందిస్తున్నట్లు తెలిపారు. ప్రజా పాలనలో సీఎం రేవంత్ రెడ్డి విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. కళాశాలలో సరైన టాయిలెట్లు లేవని,పలు సమస్యలపై పలువురు విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఎమ్మెల్యే కళాశాలలో నెలకొన్న అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను కళాశాల సిబ్బంది, విద్యార్థులు శాలువా కప్పి ఘన సన్మానం చేశారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో పేర్లు సరిచూసుకోవాలి



కాటారం : ఓటరు జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ



చిట్యాల : జడలపేటలో జాబితాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ



ముసాయిదా ఓటర్ల జాబితాను పెడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

చిట్యాల: మండలంలోని 24 గ్రామ పంచాయితీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాను జీపీ కార్యాలయాల్లో పెట్టడం జరిగిందని గ్రామస్తులు వాటిని సరిచూసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలోని జడలపేట గ్రామపంచాయితీ కార్యాలయంలో ఆయన ఓటరు జాబితాను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వార్డుల వారీగా జాబితాను తయారు చేయడం జరిగిందని అన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 14 నుంచి 21 వరకు అయా గ్రామ పంచాయితీ కార్యదర్శులకు లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని తెలిపారు.

పలిమెల : మండల పరిషత్ కార్యాలయంలో, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం ముసాయిదా ఓటర్ల జాబితాను నోటీసు బోర్డుల్లో అంటించడం జరిగిందని ఎంపీడీఓ ఎం.శ్రీనివాస్ తెలిపారు. మండల స్థాయిలో ఈనెల 19న రాజకీయ పార్టీల అధ్యక్షులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రకాష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాటారం: మండలంలోని 24 గ్రామపంచాయితీ కార్యాలయాల్లో, స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఓటర్ జాబితాను ప్రచురణకు ఉంచారు. ఏవైన అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21లోగా లిఖితపూర్వకంగా తెలపాలని వారు పేర్కొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



మొగుళ్లపల్లి: అంగన్‌వాడీ సెంటర్..

కాటారం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు స్థానికంగా లభించే పోషకాహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని గుండ్రాత్‌పల్లి అంగన్‌వాడీ టీచర్లు వేమునూరి వెంకటలక్ష్మి, రాజలక్ష్మి అన్నారు. సీడీపీఓ రాధిక, సూపర్‌వైజర్ వీణ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని గుండ్రాత్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు, పప్పుదినుసుల్లో అనేకమైన పోషకాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన, మూడేళ్లు నిండిన చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు శోభన్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, వీఓలు విజయ, సంధ్య, ఆశ కార్యకర్త విజయ పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మొగుళ్లపల్లి: మండలంలోని కాసులపహాడ్ అంగన్‌వాడీ సెంటర్‌లో సూపర్‌వైజర్ మాధవి ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో లభ్యమయ్యే పౌష్టికాహార పదార్థాలను సమయానికి సక్రమంగా గర్భిణులు తీసుకున్నట్లయితే ఆరోగ్యమైన శిశువులకు జన్మనిస్తారని ఆమె అన్నారు. అంగన్‌వాడి కేంద్రాల్లో లభించే పౌష్టికాహార పదార్థాలను విధిగా తీసుకోవాలని తద్వారా రక్తహీనత పూర్తిగా తగ్గిపోయి శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అన్నారు. విద్యావిధానంలో ప్రీస్కూల్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

ఎస్ఎస్‌తాడ్వాయి : బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న జిల్లాలోని గిరిజన, గిరిజనేతర రైతులందరికీ రుణమాఫీ చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల రాంబాబు ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2018 ముందు రెన్యువల్ చేసుకుని వందలాది మంది రైతులకు రు ణమాఫీ వర్తించలేదన్నారు. రాష్ట్రమంత్రి వర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సీతక్క రుణమాఫీ కానీ రైతులందరికీ రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉచిత బియ్యం పంపిణీ



మొగుళ్లపల్లి : మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, పిడిసిల్ల ఉన్నత పాఠశాలలో రైస్ లవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ బై ఏ బ్యాగ్ ఫీడ్ ఏ ఫ్యామిలీ అనే నినాదంతో సంస్థ లక్ష్యాలను టీవీఎస్ రతన్ రాజ్ విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం ఎల్లారెడ్డి పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 19 విద్యార్థుల కుటుంబాలకు, పిడిసిల్లలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 38 విద్యార్థుల కుటుంబాలకు, కొర్కిశాల పాఠశాలలోని 25 విద్యార్థుల కుటుంబాలకు, ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేశారు. పిడిసిల్ల పాఠశాల హెచ్‌ఎం ఎండీ.సాధిక్, లవ్ రైస్ వలంటీర్స్ టీవీఎస్ రతన్ రాజ్, రిత్విక్ రాజ్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ శోభ, పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో మంథని



బురదరోడ్డును పరిశీలిస్తున్న నారాయణరెడ్డి, నాయకులు

కాటారం: మంథని నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందని సరైన రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి ఆరోపించారు. మహాముత్తారం మండలం స్తంభంపల్లిలో బురదమయంగా మారిన రోడ్లను శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. మంత్రి శ్రీధర్‌బాబు ఇలాఖాలో రహదార్లు అధ్వానంగా మారిపోయాయని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయిన తర్వాత తన సొంత నియోజకవర్గానికి రూ.1500 కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి చేయిస్తున్నారని తెలిపారు. శ్రీధర్‌బాబు మాత్రం తన నియోజకవర్గ అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే స్తంభంపల్లి నుంచి ములుగుపల్లి రోడ్డు తక్షణమే నిధులు కేటాయించి రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శి పసుల శివ, సీనియర్ నాయకులు లచ్చయ్య, లక్ష్మణ్, మంద రాజు తదితరులు పాల్గొన్నారు.

‘మహిళా శక్తి’ని సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీపీఎం రవి

పలిమెల : మహిళా శక్తి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం రవి అన్నారు. శుక్రవారం మండలంలోని రైతు వేదికలో సెర్ప్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగు మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా శక్తి కార్యక్రమాలపై పాడిగేదెలు, ఆవులు, పెరటి కోళ్ల పెంపకం లబ్ధిదారులకు ఏపీఎం ఇందారపు రవికుమార్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డీపీఎం రవి హాజరై మాట్లాడుతూ పీఎంజీపీ కింద బ్యాంక్ ద్వారా 35 శాతం సబ్సిడీ మహిళా సంఘాల సభ్యులకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ వంశీ మాట్లాడుతూ పాడి గేదెల రకాలు, ఫీడింగ్ విధానం, పాల దిగుమతి, సంక్రమించే వ్యాధులు, వైద్యవిధానం, తదితర విషయాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పెరటి కోళ్లు, నాటు కోళ్ల పెంపకంలో నాలుగు నుంచి ఆరు వారాల వరకే లాభాలు పొందవచ్చని తెలిపారు. సదస్సులో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం వినేష్‌రావు, ఎంపీఓ ప్రకాష్‌రెడ్డి, సీసీ స్వామి, వీఓఏలు, మహిళా శక్తి లబ్ధిదారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మారక భవనానికి స్థలం కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న ఏవైఎస్ నాయకులు

టేకుమట్ల : మండల కేంద్రంలో అంబేడ్కర్ స్మారక భవనానికి స్థలం కేటాయించాలని కోరుతూ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య, అంబేడ్కర్ మండల అధ్యక్షులు ఆరకొండ రాజయ్యలు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలోనే భవన నిర్మాణానికి నిధులు మంజూరైనా స్థలం లేకపోవడంతో భవన నిర్మాణాన్ని చేపట్టలేదని అన్నారు. వారి వెంట టౌన్ అధ్యక్షుడే మచ్చ ప్రభాకర్, మాడుగుల వీరయ్య, మారపెల్లి కొంరయ్య, ఎల్కటి రాజయ్య, గుర్రం రాజేందర్, పొల్సాని దేవేందర్‌రావు, తదితరులు ఉన్నారు.

శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: ఐటీఐ విద్యార్థులకు సింగరేణిలో అప్రెంటిషిప్ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి వివిధ ట్రేడ్ల ఐటీఐ(ఎన్‌సీవీటీ) అభ్యర్థులకు సింగరేణిలో నేషనల్ అప్రెంటిషిప్ ప్రమోషన్ స్కీమ్ వెబ్‌పోర్టల్‌లో పొందేందుకు ఆసక్తి ఉన్న అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 24న సంబంధిత పత్రాలను జీవీటీసీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

గణేశ్ మండపాల వద్ద పూజలు, అన్నదానం

చిట్యాల : పూజలు చేస్తున్న భక్తులు



మల్హర్: పూజలు చేస్తున్న భక్తులు



టేకుమట్ల, చిట్యాల, రేగొండ, కాటారం, మల్హర్, మండలాల్లోని అన్ని గ్రామాల్లో గణపతి నవరాత్రోత్సవాల్లో ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరికొన్ని గ్రామాల్లో మహిళలు కుంకుమ పూజలు చేశారు. అనంతరం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అంకుషాపూర్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం మల్హర్ మండలంలోని తాడిచర్ల వేంకటేశ్వర ఆలయంలోని వినాయకుడికి లక్ష వస్త్రంతో అలంకరణ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



రేగొండ: కొత్తపల్లిగోరి గోపాల ఆశ్రమంలో..



టేకుమట్ల : కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కాటారంలో..



పెద్దంపల్లిలో..

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



టేకుమట్ల పీఎస్‌లో బీఆర్ఎస్ నాయకులు



చిట్యాలలో..

టేకుమట్ల: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు జరిపిన దాడికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా టేకుమట్ల, చిట్యాల, మొగుళ్లపల్లి, రేగొండ, పలిమెల మండలాల బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం

పలిమెల : పార్టీ మారిన ఎమ్మెల్యే తీరుపై ప్రశ్నించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పై జరిగిన దాడిని ఖండించిన మాజీ మంత్రి హరీష్‌రావును అరెస్టు చేయడం సిగ్గుచేటని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడమే నేరంగా చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయకుండా బీఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆయన ధ్వజమెత్తారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులను చలో హైదరాబాద్‌కు తరలిపోకుండా ముందస్తుగా శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారు మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు,మండల యూత్ అధ్యక్షుడు అలీమ్ ఖాన్, శ్రీహరి, టౌన్ యూత్ ప్రెసిడెంట్ రాజశేఖర్,తిప్పిరి రవి తదితరులు ఉన్నారు.



మొగుళ్లపల్లి : అరెస్ట్ అయిన బీఆర్ఎస్ నాయకులు



రేగొండలో..



కాళేశ్వరం: మహదేవపూర్‌లో..

ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగరాణి

మొగుళ్లపల్లి : మండలంలోని పాత ఇస్సిపేటలో మొగుళ్లపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ నాగరాణి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొబ్బరి చిప్పలు, కొబ్బరి బొండాలు, పాత టైర్లు, సిమెంట్ డ్రమ్ములు, లాంటివి ఇంటి బయట వేయడం వల్ల వర్షాల వల్ల వాటిలో నీరు నిల్వ ఉండి లార్వా తయారై, దోమలు తయారవుతాయన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలని, ఎవరికైనా అనారోగ్యం లేదా జ్వరం వచ్చినట్లయితే వైద్య సిబ్బందికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునిత , ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.